


# భూమి దుఃఖం

ఎంత ఆపుకుందామన్నా సుందరయ్యకు దుఃఖమాగడంలేదు. కన్నీళ్ళు ఎక్కడినుండి ఎగదన్నుకొస్తున్నాయో.. గొంతు దగ్గరపడి.. ఉక్కిరిబిక్కిరైపోతూ, సుడిగాలిలో ఒట్టి కాగితపు ముక్కవలె.. కడుపులో ఎవరో చేతులుపెట్టి ఊర్చేస్తున్నట్టు... నాభి దగ్గర్నుండి ఏడుపు పొంగి పొంగి.. తమాయించుకోవడం వశంకావడం లేదు సుందరయ్యకు. యిక ఆరిపోబోయేముందు వత్తిలా రెపరెపలాడుతూ.. మనిషి.. దుఃఖంతో సుళ్ళుతిరిగిపోతున్నాడు.

కన్నీళ్ళలో నుండే ఎదురుగా గడియారం దిక్కు చూశాడు.

రాత్రి..మూడు గంటల పది నిముషాలు.

చుట్టూ అంతా నిశ్శబ్దం..ఎక్కడా ఏ అలికిడీ లేదు.

వెల్లగిలా నులకమంచంపై పడుకుని తలకింద రెండు చేతులనూ పెట్టుకుని గంటలకు గంటలు ఎప్పట్నుండో అలా పైకప్పులోకి చూస్తూ

ఉండిపోయిన సుందరయ్యకు మనసంతా గొర్రుకొట్టిన పొలంలా ఉంది. గుండెల్లోకి ఎవరో ఉలులను దిగ్గొడ్తున్నట్టు..శరీరం ఖండఖండాలుగా విడిపోతున్నట్టు..కళ్ళముందే అంతా ముక్కలు ముక్కలుగా ధ్వంసమైపోతున్నట్టు.,

ఎలా జరిగిందిదంతా..ఒక్క రెండు నెలల్లోనే..యింత బీభత్సం..యింత వ్యాపారం..యింత దురాక్రమణ..యింత దగా..మనుషులు మనుషులను కొనడం..మనుషులు భూములను కొనడం..భూములు మనుషుల చేతుల్లో కాగితపు ముక్కలకంటే హీనంగా పీలికలు పీలికలైపోవడం..మట్టికి రెక్కలు రావడం, ఒర్రెలు, బోళ్ళు, వాగులు, గుట్టలు..అన్నీ డబ్బుగా మారిపోతూండడం.. ఏమిటి..ఏమిటిదంతా.

సుందరయ్యకు అంతా..యింకా ఓ అర్థంగాని మాయవలెనే అనిపిస్తోంది. అతనికి ఈ భూమిని మింగేసే చిచ్చు ఎక్కడ పుట్టిందో అర్థంకావడం లేదు. ప్రశాంతంగా ఉండే తమ ఊళ్ళోకి అకస్మాత్తుగా ఈ పెద్ద పెద్ద కార్లు, ఖడక్ బట్టల మనుషులు, అన్ని చేతివ్రేళ్ళకూ బంగారు ఉంగరాలు పెట్టుకున్న తెల్లసీమపందుల్లాంటి ఘరానా వ్యక్తులు ఎక్కడనుండి ఊడిపడ్తున్నారో అర్థంకావడంలేదు.

ఒకరోజు రెండు కార్లొచ్చాయి. సర్పంచ్‌తో, ఒక వార్డు మెంబర్‌తో రహస్యంగా మాట్లాడారు. ఆ వచ్చినవాళ్ళు సీసాలకు సీసాలు తాగారు. ఊరిబయటికిపోయి పొలాలు, తాళ్ళు, చెరువుకట్ట, మైసమ్మగుట్ట, హనుమంతుని గుండు.. అంతా కలియదిరిగి సాయంత్రం వెళ్ళిపోయారు.

యిక మర్నాటినుండి ఏ చెట్టుకింద చూచినా గుంపులు గుంపులుగా మనుషులు.. దిక్కుమాలినవాళ్ళ చేతుల్లో సెల్‌ఫోన్లు.. హలోహలోలు..సాయిబు హోటల్ నిండా రాత్రికి రాత్రులు మందుసీసాలు రావడాలు..ఎవరినోట విన్నా భూమిని అమ్ముకోవడం గురించే ముచ్చట్లు. అమ్ముకోకుంటే ముంచుకురాబోయే ముప్పుగురించి బెదిరింపులు..భయపెట్టడాలు..భయపడడాలు..అంతా ఓ యుద్ధవాతావరణం.

సుందరయ్య సూటిగా సర్పంచ్ రామలింగంను అడిగాడు.. "ఎందుకు ఊర్లోని జనమంతా యిట్ల బిత్తర పడిపోతున్నారు. ఏం జరిగిందసలు" అని.

"మొన్నవాళ్ళొచ్చి చెప్పింద్రుగదా..నువ్వినలేదా..మన ఊరు ఊరంతా ఆ ఎస్సీజడ్‌ల పోతాందట..భూములను ప్రభుత్వం తీసుకుని మనను ఊరు ఖాళీ చేయమంటదట. మన భూములకు సర్కార్ లెక్కప్రకారం ఏ పైసో పర్కో కట్టిచ్చి ఎక్కడన్నా పునరావాసం ఏర్పాటు చేస్తదట..గీ విషయం విన్నకానుంచి అసలు సంగతేందని రోజూ హైద్రాబాద్‌కు తిరుగుతనే ఉన్న.."

"ఏం తెల్సింది మరి"

"పోవుడైతే ఖాయమని తేలింది. ఢిల్లీనుంచి శాంక్షనైన కాగితాలను

పట్టుకుని నిన్నచ్చిండ్లు చూడు..ఆ ఎర్రటి పొడుగుకార్ల..వాళ్ళదగ్గర అన్ని కాగితాలున్నయ్. పన్నెండు ఊర్లుపోతానై. మొత్తం నాల్గువేల ఎకరాలు కావాల్నట వాళ్ళకు. గవర్నమెంట్ మన ఊర్లపేర్లుచెప్పి, ఆర్డరిచ్చి ఓసారిపోయి చూచుకోనిరమ్మన్నదట. వచ్చిండ్లు వాళ్ళు. బాజాప్తా కాగితాలున్నయ్ వాళ్ళదగ్గర.."

"నాకర్ధంగాలే..మన వూళ్ళను వాళ్ళకెందుకిస్తరు."

"గదే మత్‌లబున్నది..గవర్నమెంట్ అందరికి ఉద్యోగాలు యిప్పిచ్చి ఈ దేశాన్ని డెవలప్ చేయాలని పెద్ద పెద్ద సార్లతోని విచారించి 'స్పెషల్ ఎకనామిక్ జోన్స్' అని కొన్నింటిని ఏర్పాటు చేస్తాంది. ఈ మన ఊళ్ళన్నింటిని ఒక గ్రూప్‌కిస్తది. వాళ్ళు ఈ వేల ఎకరాల జాగను సాఫ్ చేసి యిక్కడ ఐటి పార్క్ తయారుచేస్తరు. ప్రపంచంల అమెరికా, లండన్ గిట్ల అన్ని దేశాలనుంచి జనం డైరెక్టగ ఈ మన ఏరియాకొస్తరు బ్యారం గురించి – కంప్యూటర్‌ల్ల మన పోరగాండ్లు బాగ హుషారుగదా. యిగ యిక్కడ ఉద్యోగాలే ఉద్యోగాలు..గట్ల.."

"అద్సరేగని..ఎవనికో ఉద్యోగం కావాల్నని యిక్కడ ప్రశాంతంగున్న మనల ఎల్లగొట్టుడేంది"

"అరే..అదంతే బై..పదూర్లళ్ళ అంతా కలిపి ఓ వేయిగడప–రేపు యిక్కడ యిండస్ట్రీ పడ్తే వేలమందికి ఉద్యోగాలు.."

"మరి మన భూములు.?"

"గదే యిప్పుడు ముందున్న సంగతి..యిప్పుడు మన ఊర్లె ఎకరానికెంత ధరుంది. మా అంటే ఎకరాకు ముప్పయివేలు..ఉన్న సగం ఊరి భూములల్ల రాళ్ళు రప్పలేనాయె. రెండు గుట్టలే ఉండే..గవర్నమెంట్ రేపు ఖాళీ చేయిస్తే ఎకరానికి యిరవై వేలిస్తే మహాఎక్కువ. నిన్న కార్లల్లవచ్చిన ఆసామితోని మాటాడిన..మా ఊరి భూమంతా గుత్తకు కొనుక్కో..మాకు మాత్రం మంచి రేటియ్యి..నువ్వు ఎట్లన్న ఎవరికన్న అమ్ముకో అన్న నేను..ఏమంటవ్ నువ్వు"

"మనం భూమి యియ్యకుంటే ఏంజేస్తరు" అన్నాడు సుందరయ్య అమాయకంగా.

"ఏంజేస్తరా..నీ భూమికొనరు. అందరు అమ్ముకోని పోతే నువ్వొక్కనివుండి ఏంజేస్తవ్. అంటెంక అగ్గువసగ్గువకు ప్రభుత్వం నీ భూమిని గుంజుకుంటది. యిట్లాంటప్పుడు నల్గురితో నారాయణ."

"అరే..గదేంది సర్పంచ్‌గారూ..తరతరాలుగ ఈ భూమిలపుట్టి ఈ భూమిల పెరిగి యీ భూమితోనే బతుకుతున్నోళ్ళం..ఈ భూమిని యిచ్చి ఎట్లపోతం..ఏడికి పోతం..ఎన్ని రూపాయలిచ్చినా ఈ భూమి మన పెయ్యిల ఒక అంగం లెక్కుండె. ఎట్ల వాళ్ళ పాలు చేస్తం.."

"సుందరయ్యా..రోజులు గట్లచ్చినై..విచారించుకో..నేనైతే..ఆ బడాబాబులతోని మాట్లాడి ఎకరానికి నాల్గులక్షలియ్యన్న..అటెంక వాళ్ళిష్టం..

మీ అందరి యిష్టం.” సర్పంచ్ రామలింగం హీరోహోండా మోటార్‌సైకిల్ స్టార్ట్ చేసిండు.

సుందరయ్యకు ఏమీ తోచక పిచ్చిపిచ్చిగా చూస్తుండగానే- సర్పంచ్ అన్నాడు “ఒకవేళ..రేటు వస్తే అమ్ముకోవడమే మంచిది సుందరయ్యా..ఈ చాన్స్‌పోతే ఈ మన ఊరికి యింత లోపలికచ్చి ఎకరానికి యిరవైవేలు గూడివ్వడెవడు..చానమంది నా దగ్గరికచ్చి మంచి రేటస్తే అమ్ముదామనే అంటాండ్లు”

“... ”

“నీకెంతుంది భూమి”

“పన్నెండెకరాలు”

“మరింకేంది నలభై ఎనిమిది లక్షలు..ఎప్పుడైన చూస్తవా జన్మల అంతడబ్బు..హాయిగమ్ముకొని ఎక్కడ్నో కొంత భూమికొనుక్కొని పిల్లల్ని తీనుకొనిపోక..ఏందయ్యా, తరతరాల భూమి అంటవ్..నో సెంటిమెంట్..ఆలోచించుకో..” రామలింగం వెళ్ళిపోయాడు.

ఎక్కడో కుట్ర జరుగుతోందనుకున్నాడు సుందరయ్య.

ఎవడో ఢిల్లీనుండి యిక్కడి పదిరవై ఊళ్ళను కబ్జాచేయడమేమిటి. యిక్కడ ఏదో కార్ఖాన పెట్టడమేమిటి..వాడెవడో ఎవనికో ఉద్యోగాలనిస్తాడంటే తాము ఊళ్ళమ్ముకొని తమ బతుకులను మట్టిపాల్జేసి వెళ్ళిపోవడమేమిటి..,

అప్పటినుండి సుందరయ్య తనువంతా కళ్ళు, చెవులు చేసుకుని ఊర్లోని ప్రతి ఒక్కరినీ పరీక్షగా గమనించడం మొదలెట్టాడు.

ప్రతి సాయంత్రం..ఎక్కడనుండొస్తున్నాయో..ఊరు ఊరంతా, ఆడా,మగా అందరూ సీసాలకు సీసాలు తాగుతున్నారు. బిర్యానీ పొట్లాలొస్తున్నాయి ఎక్కడినుండో, మనుషులు గుంపులు గుంపులుగా కాకుండా ఎవనికివాడే రహస్యంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రతివాడూ తన కడుపులో ఏముందో బయటికి చెప్పకుండా ఎదుటివాని విషయాన్ని పసిగట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఊరు ఊర్నంతా ఓ మాయ, ఓ నిషా, ఓ కనికట్టు కమ్మేసింది.

ఎవనినోట విన్నా ఎకరాలు..లక్షలు..చాకలి, మంగలి, మాల, మాదిగ.. ఏ కులపోడైనా..తమ భూమిని ఉజ్జాయింపుగా లక్షల్లోకి లెక్కకట్టుకుని..ఆ లక్షలతో ఏంజేయాలని..ఆ కట్టలతో ఎలా ఎక్కడ స్థిరపడాలని..ఎన్నడూ లక్షల ముఖం చూడని మనుషులు కలల కౌగిళ్ళలో ఉక్కిరిబిక్కిరైపోతూ.,

## 2

మొట్టమొదట మంగలి రాములు తన రెండెకరాల భూమిని అమ్మి ఇబ్రహీంపట్నం పోయి రిజిస్ట్రేషన్ చేసి ఆరులక్షల రూపాయలను తెచ్చాడు ఒక

చేతిసంచి నిండా. సాయిబు హోటల్‌లో అందరికీ చూపించాడు కట్టలను..అన్నీ వందరూపాయల కట్టలు. చూచినవాళ్ళందరి దిమ్మతిరిగి పోయింది.

రాములును ఎవరో కార్లో తీసుకొచ్చి సాయిబు హోటల్‌ముందర దించి వెళ్ళిపోయారు. అతను అప్పటికే పీకలదాకా తాగి వత్తి అంటించిన చిచ్చుబుడ్డిలా ఉన్నాడు. అప్పటికే అక్కడ ఎప్పట్నుండో ఎదురుచూస్తున్న మంగలి రాములు పెళ్ళాం సాయమ్మ మొగుణ్ణీ, డబ్బునూ ఒడిసి పట్టుకుని..“ఈ నోట్లు పాడుగాను.. కొరుక్కతింటమా వీటిని..యిరవై ఏండ్లనుంచి రెక్కలు ముక్కలు చేసుకున్న భూమితల్లి పాయె..ఈ చేతుల్తోటి నాటిన, కలుపు తీసిన, కోసిన, నాల్గుమెతుకులు తిన్న..పాసిపాయె..యియాల్టితోటి ఆ భూదేవికి మాకు ఋణం పాసిపాయె..” ఒకడే ఏడ్పు..ఆమె విలవిలా ఏడుస్తూనే తాగి ఊగుతున్న మొగుణ్ణీ, డబ్బు సంచీనీ నడిపించుకుంటూ..చీకట్లో..కనబడకుండా పోయింది కాసేపటికి.

తర్వాత నిశ్శబ్దం..

ఎదురుగా..అంతా చీకటి..

సుందరయ్య సాయిబు హోటల్లో.. గుడ్డిదీపపు వెలుగుముందు మౌనంగా కూర్చుని ఆలోచిస్తున్నాడు.

రెండెకరాలు..ఆరులక్షలు.

నిజానికి ఎక్కువరేటే..

యింతరేటు పెట్టికొన్నోడు, వ్యవసాయమంటేనే తెలువనోడు..ఈ భూమిని కొని ఏంజేస్తడు.

తప్పకుండా అంతకన్నా ఎక్కువకు ఎవనికో అమ్ముతడు, లేదా అంతకంటే ఎక్కువ డబ్బును ఈ భూమిలోనుండి ఏదోరకంగా పుట్టిస్తడు..ఐతే,

భూమికీ మనిషికీ..ఒట్టి మట్టికీ, డబ్బుకూ ఉన్న సంబంధమే ఉందా. ఏండ్లకు ఏండ్లు ఈ భూమిని దున్ని, ఈ మట్టిని పిసికి, ఈ నేలపై నడిచి, ఈ గాలిని పీల్చి, ఈ పచ్చని చెట్లనీడన విశ్రమించి- ఒక తల్లితో పిల్లలకు ఏర్పడే అనుబంధంవంటి సంబంధం సంగతేమిటి. కాలికి ముల్లు గుచ్చుకుంటే కంటికి నీరొస్తదిగదా..మట్టిని నమ్ముకున్న మనిషికి గుండెపగిలి..భూమినుంచి మనిషి విడివడి వేరయ్యేదెట్లా.

ఈ అనుబంధం విలువ ఎంత.

అనుబంధం ఉన్నంత మాత్రాన డబ్బుతో కొలువబడే విలువలు మార్తాయా. మట్టిముంతలో ఉండే నీళ్ళు, కల్లు, బంగారం వంటి పదార్థం విలువలు మార్తాయిగాని మట్టి ముంత విలువ తల్లివలే అంతే ఉంటుందికదా.

ఆనాటి రాత్రే..సుందరయ్య యింటికి తిరిగొచ్చి..అన్నం తింటూండగా పెద్దకొడుకు రాజకొంరు అన్నాడు– “మన భూములను కూడా అమ్ముదమానె” అని.

ఊరు ఊరినంతా భూమిని అమ్ముకోవడం పిచ్చి కమ్మేసింది. ఒకప్పుడు ప్రతిఒక్కరూ భూమిని నమ్ముకున్నవాళ్ళు. వ్యవసాయం పనుల మెళకువలు ఒకర్నుంచి మరొకరు తెలుసుకుని పోటీపడి పంటలు పండించి నిండుకుండల్లా పండువెన్నెలై బతికినవాళ్ళు..

ఏమిటీ మైకం..ఏమిటీ డబ్బునిషా..మనిషికి అవసరాలను మించిన యింత డబ్బు అవసరమా. ఎప్పుడూ ఓ ఐదు పదివేల రూపాయలకంటే ఎక్కువ డబ్బు ముఖం చూడని ఈ జనం లక్షలకు లక్షలు కట్టలు కంటబడగానే కల్లుతాగిన కోతులై పిచ్చి పిచ్చిగ చేస్తున్నరు.

"..ఏమంటవే నాయిన..షేక్ సాయిబు నిన్న హైద్రాబాద్ పోయి కనుక్కున్నడట..వాడెవడో ఓ రెండువందల ఎకరాలు కొని యిగ ఊకుంటడట.. అటెంక మిగతా భూమి పడావ్ పడ్తది. ఆలస్యమైతే మనం గవర్నమెంటు చేతిల్నే పెట్టాలె. వాడేమిస్తదు..మన్ను..దీపముండగనే యిల్లు సక్కబెట్టుకోమన్నరుగదా పెద్దలు.."

సుందరయ్య అన్నంముద్ద నోట్లోపెట్టుకునేటోడు చటుక్కున ఆగి ముప్పఏండ్ల కొడుకు ముఖంలోకి చూచిండు. రాజకొంరు ముఖం భూమిని అమ్ముకుంటే రాబోయే లక్షల కొద్దీ డబ్బు ఊహతో కైపెక్కి తోమిన రాతిగిన్నెలా ఎర్రగా, ఉద్విగ్నంగా ఉంది.

సుందరయ్య ఏమీ మాట్లాడలేదు..ఒక సూటి చూపొకటి చూచి.,

మళ్ళీ తలవంచుకుని అన్నం తినడం మొదలెట్టాడు.

ప్రక్కనే భార్య భూదేవి కుప్పబోసిన దుఃఖంలా కూర్చోని అన్నంగిన్నెల దిక్కూ నేల దిక్కూ చూస్తోంది. హాల్లోనే గడంచె మీద రాజకొంరు యిద్దరు పిల్లలు..రాణి, రవి నిద్రపోతున్నారు. కోడలు ప్రక్క అరుగుమీద ఏదో చెరుగుతోంది చేటతో.

సుందరయ్యకు హైద్రాబాద్‌లో హాస్టల్‌లో ఉండి డిగ్రీ చదువుకుంటున్న రెండో కొడుకు శీను జ్ఞాపకమొచ్చాడు. యిద్దరే పిల్లలు తనకు..కొడుకులు. పెద్దోడు ఊళ్ళోనే పది ఫెయిలై యిక తన వ్యవసాయ పనుల్లోనే వెంటున్నడు. రాజకొంరు తర్వాత పన్నెండేళ్ళకు పుట్టిన శీనుకైనా నాల్గు అక్షరాలు చెప్పించాలని పట్నం పంపి..హాస్టల్లుంటడు. బాగానే చదువుతాన్నంటడు. సెలవుల్ల వచ్చినపుడు వ్యవసాయం పనులు చేస్తడు. హుషారే భూమి పనులల్ల.

"రొండేండ్ల కిందనే భూమినంత మీ యిద్దరి పేర చేసినగదరా రాజకొంరు. నీది ఎనిమిదెకరాలు..తమ్మునికి నాల్గు. భూమిని ఉంచుకునుడా, అమ్ముకునుడా మీ యిష్టం. తమ్ముణ్ణి కూడ అడుగు.."

"రేపు పట్నం పొయ్యిరానా.."

"నీ యిష్టమన్నగదా"

"నువ్వు మనస్పూర్తిగ చెప్తలేవే నాయిన.."

"ఏంజెప్పేది బిడ్డ..నడమంత్రపు డబ్బు కట్టలకట్టలు గుట్టలోల్లె వచ్చి నెత్తిలపడి మనుషులను పాపబట్టె..ఉన్న తావిడిచి ఏడికి పోతంబిడ్డా..అంతా మాయ. మనుషులను మాయ కమ్మేసింది. ఎవనిమాట ఎవడింటడు..కానీ.."

సుందరయ్య కంచంల చేతుల కడుక్కుని లేచి బయటకి..వాకిట్లోకి వెళ్ళిపోయాడు- బయట వెన్నెల పిండారబోసినట్టు తెల్లగా పరుచుకుని ఉంది ఊరినిండా.

ఊరంతా నిశ్శబ్దం.

ఎక్కడో ఊరకుక్క మొరుగుతోంది.

అందరి ఇండ్లల్లో యింతే. తర్జన భర్జన. లోలోపల పిసుకులాట. కుమ్ములపెట్టిన కందగడ్డోల్లె..కుతకుత ఉడికిపోవుడు. పైకిమాత్రం అంతా నిశ్శబ్దమే..నివురుగప్పిన నిప్పు.

## 3

నెలరోజులు గడిచిందో లేదో.

ఊరు ఊరంతా..దాదాపు అందరూ భూమిని అమ్మేశారు. వాడెవడో కార్లలో ఊరికి రావడం మానేశాడు. వీళ్ళే ఏ సర్పంచ్‌నో, వార్డుమెంబర్‌నో పట్టుకుని పట్నం పోవుడు..రిజిస్టర్ చేసుడు..డబ్బు తెచ్చుకునుడు..రాత్రింబగళ్ళు తాగుడు..ఊళ్ళె కొత్తగా రెండు వైన్‌షాప్‌లు పడ్డయి.

ఊరు సగంకన్నా ఎక్కువే ఖాళీ ఐంది.

గూనపెంకల యిండ్ల ముందట కొన్ని కొత్త కార్లు కనిపిస్తానై. పైసున్నపుడే సుఖం..ఎంజాయ్ చెయ్యి అంటున్నరు. చదువురానోళ్ళుకూడా సెల్‌ఫోన్ల మాట్లాడ్తున్నరు.

సుందరయ్యకు అంతా వెనుకట విఠలాచార్య సినిమాల చూచినట్టు వింతగా, నమ్మశక్యంకాకుండా, నిజమే మాయవలె.. గమ్మత్తుగా ఉంది.

రాజకొంరు సర్పంచుతోని భలే దోస్తి చేస్తాండీమధ్య..వాళ్ళిద్దర్ది చిన్నప్పుడు ఒకటే బడి.

ఐతే ఊరు ఊరంతా నిద్రపోతున్న కూకేటి పామువలె ఉంది. అందరికళ్ళలో భయం. లక్షలకు లక్షల రూపాయలను ఎక్కడ దాయాల్నో తోచని భయం. ఏమైతదోనన్న ఉద్విగ్నత..నిన్నటిదాకా వాళ్ళు రప్పలనుకున్న భూమి లక్షలను కురిపించడం..యిదంతా ఏంది.?

సుందరయ్యకు..గతదినం రాత్రి తనకూ, రాజకొంరుకూ నడుమ జరిగిన సంభాషణ జ్ఞాపకమొచ్చింది. అప్పుడు భూదేవికూడా ఉంది ప్రక్కన. మౌనంగానే విన్నది అంతా..నిజంగానే భూదేవిలా.

"నాయినా..జాగ్రత్తగ ఇను. రామలింగం చెప్పిండు..యిగ మనూళ్ళె

భూమి అంతా ఐపోయింది. ఒక్క మన పన్నెండెకరాలు, రామలింగం ముప్పయిరెండు,గా మన్నెపోళ్ళయి ఎనిమిదెకరాలు.. గిదే మిగిలింది. రామలింగం మొన్న హైద్రాబాద్‌పోయి కపూర్ సాబ్‌తోని మట్లాడిండట. లాస్ట్ కాబట్టి మనకు ఎకరాకు ఐదు లక్షలిస్తనన్నడట. మనకు జుమ్‌లా అరవై చిల్లరస్తది. యిగ అమ్ముదమే. లేకుంటే ఒంటరోళ్ళమైపోతం. మంచి రేటే యిది. అందరికంటె ఎక్కువ. బయటికి చెప్పద్దు. లొల్లయితది. రేపే పొద్గాల చీకట్ల రామలింగం, నేను పట్నం బయల్దేర్తానం. తమ్ముణ్ణి అట్లనే వెంటబెట్టుకోని ఇబ్రహీంపట్నంల రిజిష్టర్ చేసి రాత్రివరకు డబ్బుతోని పైలంగ యింటికస్త.." రాజకొంరు చెబుతూనే ఉన్నడు.

ప్రక్కన కోడలు గోడకు చేరగిలబడి వింటూనే.."అర్వయ్ లచ్చలా.." అంది మధ్యలో..షాక్‌తిన్నట్టు..ఉండబట్టలేక.

"ఒర్రకే పిచ్చిదాన.." గదమాయించిండు రాజకొంరు.

ఆమె లేచి నిశ్శబ్దంగా బయటికి వెళ్ళిపోయింది.

సుందరయ్యకు ఒళ్ళంతా తిమ్మిరెక్కినట్టు ఉంది. ఎవరో సుత్తెతో తలపై బలంగా బాదినట్టు. అంతా దిమ్మెక్కిపోయినట్టు..

రాజకొంరు ముఖంలోకి ఓ అర్థంలేని పిచ్చిచూపొకటి చూచి.. సుందరయ్య కూడా యింట్లోనుండి బయటికి నడిచాడు భారంగా.

అప్పుడుకూడా..యిలాగే..ఆకాశం నుండి బంగారప్పొడి రాలుతున్నట్టు పిండి వెన్నెల. వెన్నెట్లో, వాకిట్లో నులకమంచంపై వెల్లగిలా పడుకుని..

ఆకాశంలోకి చూస్తుంటే,

అన్నీ మబ్బులే..వెండి మబ్బులు.,

పిచ్చి మబ్బులు..పిచ్చి చంద్రుడు..పిచ్చి ఆకాశం..పిచ్చి భూమి -

## 4

"భూదేవీ ఏంజేస్తానవే..నిద్రస్తలేదు.." అన్నాడు సుందరయ్య భార్యనుద్దేశించి.

ప్రక్కనున్న నులకమంచంలో భూదేవి యిటువైపు తిరిగి.."నాక్కూడ నిద్రపడ్తలేదు. యివ్వాల్టితోటి దిక్కులేని పచ్చులమైపోయినమనిపిస్తాంది"

"డబ్బుందిగదనే..బస్తానిండా నోట్లే..నీ కొడుకు తెచ్చిండుగదా."

"ఏంజేస్కుంటవ్..బంగారాన్ని తింటవా..తింటాన్కి నాల్గు మెతుకులు కావాలె గాని"

"....." సుందరయ్య మాట్లాడలేదు. అతనికి రాత్రి జరిగిన సంగతులన్నీ జ్ఞాపకమొచ్చినై. ఆ రోజు రాత్రి..పదిగంటలు దాటిందేమో..అనూహ్యంగా తన యింటిముందు వాకిట్లో కొత్త కారు సర్రున వచ్చి ఆగింది. ఎవరబ్బా అని ఆశ్చర్యంతో తనూ, భూదేవీ, కోడలు, యిద్దరు పిల్లలు..అందరూ బిలబిలమని

అరుగుపైకి ఉరుకొచ్చి చూస్తే.,

కార్లోనుండి రాజకొంరు దిగుతున్నడు. దిగి డ్రైవర్కు రెండు వందరూపాయల నోట్లివవ్వగానే, కార్ను అటుయిటు సర్ది సరిగ్గా చెట్టుక్రింద నిలబెట్టి నమస్తేపెట్టి వెళ్ళిపోయిండు. వాడు పోయిన తర్వాత చిన్నకొడ్కు శీను దిగిండు చేతిలో నల్లటి పెద్ద బ్యాగ్తో. టకటకా యింట్లోకి నడుచుకుంటూ అందరూ వచ్చి..శీను బ్యాగ్ గడంచెపైన పెట్టి.. అరుగుల దిక్కున్న పెద్దదర్వాజ మూసి..

"నాయినా..రావే..ఒక్కసారి ఈ బ్యాగ్లకు చూడు" అన్నాడు వెలిగిపోతున్న ముఖంతో

అని..బ్యాగ్ను తెచ్చి తనకూ, తల్లి భూదేవికీ చూపించాడు. అన్నీ కట్టలకట్టలు డబ్బు. నిండా. కుక్కి కుక్కి సంచినిండా సర్ది తెచ్చింద్రు.

"దీన్ని అందాక గీ గుమ్మిలపెట్టు.. రేపు చూద్దాం..వీటి సంగతి.."

ఈ లోగా రాజకొంరు మరో ప్లాస్టిక్ బ్యాగ్లో తెచ్చిన చికెన్ బిర్యానీ పొట్లాలనూ, మిఠాయి పొట్లాలను విప్పి గడంచెపైన సర్దిండు. యిల్లంతా బిర్యానీ వాసన, స్వీట్ల ఘుమఘుమ వ్యాపించింది. పిల్లలు ఎగబడి తినడం ప్రారంభించి..

సంబరం దాదాపు రెండు గంటలు..

రాజకొంరు చెప్పుకొచ్చాడు. హైద్రాబాద్ల ఎలా యికమత్గ భూమిని ఐదు లక్షలకు ఎకరం చొప్పున అమ్మిందీ, ఎలా మారుతి కార్ కొన్నదీ..ఎలా క్యాష్ను జాగ్రత్తగా పట్టుకొచ్చిందీ..శీనూ వంతపాడాడు అన్నతో..యిద్దరి ముఖాల్లోనూ డబ్బు తాలూకు అంతులేని ఆనందం.

పన్నెండు దాటేదాకా ముచ్చట్లు పెట్టీ పెట్టీ..పిల్లలు కొత్త కార్లో ఆడీ ఆడీ.,

రాజకొంరు శీనుకోసం ఒక ప్రత్యేకమైన స్వీట్ను తినిపిస్తూండడం ఎందుకో సుందరయ్య యాధృచ్ఛికంగా గమనిస్తూ..గమనిస్తూ.,

చివరికి పన్నెండు దాటింతర్వాత.,

చిన్నాయన శీనుతో కలిసి పిల్లలిద్దరూ కొత్త కార్లోనే నిదురపోయారు. రాజకొంరు, కోడలు గుమ్మిపక్కనున్న వాళ్ళ గదిలోకి వెళ్ళిపోయారు.

యిక నిశ్శబ్దం మిగిలి..ఎనగర్రకింద హాల్లో..సుందరయ్యా, భూదేవి.,

ఎవరి నులక మంచాల్లో వాళ్ళు..ఎడతెగని ఆలోచనలు. తామిద్దరూ కొత్తగా పెళ్ళి చేసుకుని ఈ ఊరికి కాపురమొచ్చి..బంగారం అమ్మి కొద్దిగా చెల్క సంపాదించుకుని..యిద్దరికిద్దరూ రెండు జతల కాళ్ళు, రెండు జతల కళ్ళు, రెండు ఎడ్లబండి చక్రాలు, రెండు ఎడ్లు, రెండు జతల చేతులుగా వ్యవసాయం చేసి చేసి..

ఎన్ని ఎండలు..ఎన్ని వానలు..ఎన్ని వరదలు..ఎన్ని కరువులు..

వానకోసం ఎన్ని ఎదురుచూపులు.

భూమిని పొతం చేసుకుని..చెల్కను పొలం చేసి, రాళ్ళను చేన్లు చేసి..

భూమి పండి..పంటలై, భూదేవి కడుపు పండి పిల్లలై,

బతుకంతా కాయకష్టం..రాత్రింబవళ్ళు కనురెప్పలా కాపలా, రెక్కలు దించని ప్రయాణం..

ఎప్పుడూ భూమి..మట్టి..మొక్క..చెట్టు..పచ్చని ప్రకృతి..చల్లని గాలి.. అదో లోకం,

ఎందుకో సుందరయ్యకు మళ్ళీ దుఃఖం ఒక ఉప్పెనై ముంచుకొచ్చింది.

'యిక రేపట్నుండి..తన పొలం తనది కాదా..తన బావి, తన పంపు, తన నీళ్ళ ట్యాంక్..తను తీసిన పంటకాల్వలు..యివన్నీ తనవి కావా..'

రాత్రి చూచిన డబ్బు సంచి మెరిసింది కళ్ళలో.

కళ్ళనిండా నీళ్ళు..ఎగిసెగిసి వస్తున్న ఏడుపు.

నిద్రరాని కళ్ళు ఎర్రగా..మండుతున్నాయి.

గోడ గడియారం చూశాడు సుందరయ్య..ఐదుకావస్తోంది.

యిక వశం కావడంలేదు. మంచంలోనుండి లేచి కిటికీలోనుండి బయటికి చూశాడు.

తెల తెలవారుతోంది.

చెట్టుకింద కొత్త కారు.

బట్టలేసుకుని, చేతిలోకి కర్ర తీసుకుని సుందరయ్య చెప్పులు వేసుకుంటూండగా,

'ఏడ్కి పోతానౌ గింత పొద్దున' భూదేవి మాట విన్పించింది.

భార్యదిక్కు.. అతిదీనంగా చూచి..'యిక ఆఖరిసారి తనివితీరా పొలాన్ని చూస్కొని వస్తనే. మనసంతా కాల్తున్న కాష్ఠంలెక్కున్నది. భూదేవీ వస్త' అని ఒక్కడే వీధిలో నుండి..మట్టి బాటపైనుండి.. పొలందిక్కు,

పది నిముషాల్లో పొలంగట్టుపైకి చేరి.,

మోటార్ స్విచ్‌ను ఆన్‌చేసి..మొన్ననే పూడిక తీయించిన బావిలోనుండి నీళ్ళు బఁయ్‌మని సంప్‌ల పోస్తూండగా..రెండు చేతులనూ నీటిజాలులో చొప్పించి..చిన్నపిల్లాడిలా పులకించి..చుట్టూ పచ్చని పొలాన్ని కలియజూసి, పొలాలు..పొలాల కవతల తాటిచెట్లు..పైన కట్ట, ఆపైన గుండ్లు..గుట్టలు..

ఆపైన తెలుపెక్కుతూ తెలవారుతున్న ఆకాశం..,

తన భూమి..తన పొలం..తన చెట్లు..తన గట్లు..తన ఆకాశం.,

సుందరయ్య దబాల్న పడిపోయాడు నీటి సంప్‌లో. పైన పంప్‌లోనుండి నీటిజాలు ఉధృతంగా దూకుతూనే ఉంది.

చుట్టూ.. తిరుగుతున్న పంప్ చప్పుడు, నీటి చప్పుడు, తలలూపుతున్న

వరిపైరు చప్పుడు..చల్లని గాలి చప్పుడు,

పావుగంట తర్వాత ఎవరో పరుగెత్తుకుంటూ వచ్చారు రాజకొంరు దగ్గరికి ..'పొలందగ్గర సంప్‌ల మీ నాయిన సచ్చిపడున్నడు' అనే వార్తతో,

వార్త విన్న రాజకొంరు షాక్ తిని భోరున ఏడ్వలేదు. ఆ వచ్చిన వాడు వెళ్ళిపోగానే..కొత్త మారుతి కార్ దగ్గరికి హడావుడిగా వెళ్ళి డ్రైవింగ్ సీట్‌లో పడుకున్నట్టు ఉన్న తమ్ముడు శీను ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాడు. ప్లాన్ చేసిన ప్రకారమే విషంకలిపి తను యిచ్చిన స్వీట్‌ను కడుపునిండా తిన్న తమ్ముడు.. శాశ్వతంగా వెళ్ళిపోయాడు. కారు వెనుక సీట్లో తన పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు యింకా.

తృప్తిగా నిట్టూర్చి రాజకొంరు గబగబా యింట్లోకి వెళ్ళి రాత్రి గుమ్మిలో దాచిన డబ్బు బ్యాగ్‌ను తెరిచి చూచుకున్నాడు తృప్తిగా..సంతోషంగా. నోట్ల కట్టలు దట్టంగా అలాగే ఉన్నాయి.

తండ్రి పోయాడు..తమ్ముడూ పోయాడు..

యిక డబ్బంతా తనకొక్కడికే..

ఎదురుగా నులకమంచంలో తల్లి భూదేవి వెల్లగిలా పడుకుని కనిపించింది రాజకొంరుకు. ఆమె కళ్ళు నిశ్చలంగా ఉన్నాయి.

ఇంతకుముందచ్చినోడు నాయిన సంప్‌లపడి చచ్చిపోయిన సంగతి చెప్తాంటే అవ్వ విన్నదా.,

ఆమె బతికే ఉందో, చచ్చేపోయిందో అతనికి అర్థంకాలేదు–

●

'వార్త' ఆదివారం అనుబంధం
తేది : 11-05-2007
'కథ' - 2007